www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 28 | డిసెంబర్ | 2025 పేజీలు : 8

## జనవరి 18న జరిగే శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి




- ప్రకృతి సంపదను కార్పోరేట్లకు దోచిపెట్టడం దుర్మార్గం
- కేంద్రం సాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా తిరుగుబాటు తప్పదు
-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని

2లో

## అనర్హుల సంగతేంటి సారూ..






-అంతే వదిలేస్తారా.. చర్యలు తీసుకుంటారా?
-ప్రతి నెల అక్రమార్కుల ఖాతాల్లోకి లక్షలాది రూపాయలు
-నకిలీ ధృవీకరణలపై చర్యలేవీ...?

ప్రజాపక్షం/ ఖమ్మం : అర్హులకు పింఛన్ ఇవ్వడానికి నానా ఇబ్బందులు పెట్టే అధికార యంత్రాంగం అనర్హులకు పింఛన్ ఇవ్వడంపై ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నకు అధికార యంత్రాంగం స్పందించాల్సిన అవసరం ఉంది. అనర్హులను వదిలేస్తారా లేకుంటే చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వందలాది మందికి నకిలీ వికలాంగ ధృవపత్రాలను జారీ చేశారు. అనేక మంది కనీస వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక ముఠా గ్రామాల్లో కొందరిని ఎంపిక చేసుకుని ఎటువంటి

మిగతా 2లో..

## ప్రతి పైసా ప్రజల అభివృద్ధి కోసమే ఖర్చు






-రూ. 12,500 కోట్లతో వ్యవసాయానికి ఉచిత విద్యుత్
- రూ.8,600 కోట్లతో మహిళలకు ఉచిత ప్రయాణం
-సబ్ స్టేషన్ ప్రారంభ, శంకుస్థాపనలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/ నేలకొండపల్లి : ప్రజా ప్రభుత్వం ప్రతి పైసా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. శనివారం నేలకొండపల్లి మండలం అనంత్ నగర్‌లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు పర్యటించారు. ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి అనంత్‌నగర్‌లో 33/11కెవి సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. కామంచికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలు రాకుండా , వ్యవసాయ అవసరాలు, ప్రజా గృహ అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలని సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక మంత్రి తమ దృష్టికి తీసుకు రావడంతో వెంటనే మంజూరు చేసి తక్కువ సమయంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గత పాలకులు రాష్ట్ర ప్రజలపై ఎనిమిది లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ

మిగతా 2లో..

## శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం





-ర్యాలీలు, జాతాలు, సభలు, సమావేశాలు
-కొనసాగుతున్న జనసేవాదళ్ శిక్షణ

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో 18న జరిగే బహిరంగ సభకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో సభలు, సమావేశాలు, గోడ రాతలను పూర్తి చేయగా వినూత్న పద్ధతిలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. జనవరి ఒకటి నాటికి అన్ని ప్రధాన గ్రామాలు, మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని జిల్లా సమితి నిర్ణయించింది. జనవరి 12 నుంచి 16 వరకు అన్ని మండలాల్లో మైకుల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఇందుకు సంబంధించి ప్రచార ఆడియోను కూడా విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎనిమిదివేల మంది జనసేవా దళ్ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వగా మరి కొంత మందికి రానున్న రెండు మూడు రోజుల్లో శిక్షణ పూర్తి చేయనున్నట్లు జనసేవాదళ్ బాధ్యులు తెలిపారు. ప్రత్యేకమైన డ్రెస్‌లో ప్రదర్శన ముందు భాగాన జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు చేయనున్నారు. జనవరి ఎనిమిది నుంచి అన్ని మండలాల్లో మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఖమ్మం నగరంలో జనవరి 18న జరిగే బహిరంగ సభ జయప్రదం కోరుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. తొమ్మిదిన ఉదయం తొమ్మిది గంటలకు సిపిఐ గ్రామశాఖలు, పట్టణ శాఖల

మిగతా 2లో..

## కోట్ల అవినీతికి నిలువెత్తు నిదర్శనం







-ప్రజాధనం దోచుకునే కేంద్రంగా మారిన అభివృద్ధి ప్రాజెక్ట్
-మొరాయిస్తున్న మోటార్లు
-మొండికేస్తున్న మిషనరీలు
-కోల్డ్ స్టోరేజీల్లో ఊడిపోతున్న సీలింగ్, పగిలిపోతున్న ఫ్లోరింగ్

ప్రజాపక్షం/సత్తుపల్లి: రైతుల సంక్షేమం, ఆహార ప్రాసెసింగ్ అభివృద్ధి పేరుతో బుగ్గపాడు ఫుడ్ పార్క్‌లో ఖర్చు చేసిన కోట్ల రూపాయల ప్రజాధనం నేడు అవినీతికి, నిర్లక్ష్యానికి బలైపోయిందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆధునిక సదుపాయాలతో ఆదర్శంగా నిలవాల్సిన ఫుడ్ పార్క్, ప్రస్తుతం పనికిరాని యంత్రాలు, కూలిపోతున్న నిర్మాణాలతో ప్రజాధన దోపిడీకి నిలువెత్తు ఉదాహరణగా మారిందని స్థానికులు మండి పడుతున్నారు. ఫుడ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్ షెట్టర్లు

మిగతా 2లో..

# అనర్హుల సంగతేంటి సారూ..

(మొదటిపేజీ తరువాయి)

వైకల్యం లేకపోయినా ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 40వేల నుంచి రూ. 50వేలు వసూలు చేసి ఖమ్మం పెద్దాసుపత్రి ద్వారా నకిలీ ధృవీకరణ పత్రాలను ఇప్పించారు. కనీస వైకల్యం లేకుండానే ప్రతి నెల నాలుగు వేల రూపాయలు అక్రమార్కుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. వికలాంగుల పింఛన్ పొందాలంటే కనీసం 40 శాతం అంగవైకల్యం ఉండాలి. కానీ ఎటువంటి వైకల్యం లేకుండానే 50 నుంచి 80 శాతం వరకు వైకల్యం ఉందని ధృవీకరిస్తూ ధృవపత్రాలను అందజేశారు. ఖమ్మం జిల్లాలో ఈ ముఠా ద్వారా సుమారు రెండువేల నకిలీ వికలాంగ ధృవపత్రాలు పొంది పింఛన్ పొందుతున్నట్లు సమాచారం. బోనకల్, వైరా, చింతకాని, తల్లాడ, పెనుబల్లి, మధిర , ముదిగొండ మండలాల్లో ఇటువంటి నకిలీ ధృవపత్రాలు పొందిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. దీనిపై గతంలో ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో ప్రభుత్వాసుపత్రిలోని ఓ చిరుద్యోగిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని విధుల నుంచి తప్పించింది. కానీ ఒక వికలాంగ ధృవపత్రం బయటకు రావాలంటే కనీసం ముగ్గురు వైద్యులు ధృవీకరించాల్సి ఉంది. ఎటువంటి వైకల్యం లేకుండానే అంగవైకల్యం ఉందని ధృవీకరించిన వైద్యులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. సదరం క్యాంపులకు వచ్చి వికలాంగులు నానా ఇబ్బందులు పడితే అంగవైకల్యం ఉందని ధృవీకరించడానికి పలుమార్లు పరీక్షించి వికలాంగులను ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ తిప్పుకునే వైద్యులు అసలు వైకల్యమే లేకుండా ఎలా ధృవీకరించారన్నది ఇప్పటి ప్రశ్న. వైద్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు అనేక ఏళ్లుగా ఎటువంటి వైకల్యం లేకుండానే పింఛన్ పొందుతున్న వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంది. గ్రామాల వారీగా వికలాంగ ధృవీకరణకు సంబంధించి ప్రత్యేక పరిశీలన బృందాలను ఏర్పాటు చేసినట్లయితే నకిలీ ధృవపత్రాల ద్వారా పింఛన్ పొందుతున్న వారి గుట్టు రట్టవుతుంది. జిల్లా అధికార యంత్రాంగం వికలాంగ పునర్ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ధనాన్ని అక్రమంగా అనుభవిస్తున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా వ్యాప్తంగా పలు ఫిర్యాదులు వచ్చినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కానీ, జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు కానీ దీనిపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. వైద్యులను రక్షించే క్రమంలోనే చర్యలకు వెనకాడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికి సంబంధించి ప్రజాప్రతినిధులు సైతం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అర్హులకు దక్కని పింఛన్ అనర్హులకు అందడం పట్ల గ్రామాల్లో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### జనవరి 18న జరిగే

# శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి

**- హామీలను అమలు చేయాలి : సాబీర్ పాషా.**

**ప్రజాపక్షం/పాల్వంచ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకృతి సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య అని, మోడీ సర్కార్ ప్రజల కోసమా ? లేకా ఆదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా అన్నది తేల్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సంధర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్‌ల పేరుతో కొనసాగిస్తున్న నిర్భంధాలపై ప్రజా ఉద్యమాలు, తిరుగుబాటు తప్పవన్నారు.మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కమ్యూనిస్టులను లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను డెడ్‌లైన్ పెట్టీ మరీ చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అడవుల్లో నిక్షిప్తమైన అపార సహజ సంపదను కాజేసేందుకు, కొల్లగొట్టేందుకు అధికారాన్ని అడ్డం పెట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను చంపటం సరైనది కాదని హితవు పలికారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ముందుకు వచ్చినప్పటికి పట్టించుకోకుండా ఏకపక్షంగా మారణ హోమానికి తెగబడటం పైశాచికమన్నారు. మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఖమ్మం కేంద్రంగా జనవరి 18న, ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఐదు లక్షల మందితో జరుగనుందన్నారు. దీనికి 45 దేశాల నుండి ప్రతినిధులు రానున్నారని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బారీ జన సభకు గడప, గడపకూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పనైపోయిందని అవాకులు, చెవాకులు పేలుతున్న వారికి ఈ వేడుక కనువిప్పు కావాలన్నారు. ఈ సభ దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోనున్నదని అన్నారు.



పాలక ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నిలుపుకొంటూ అమలు చేయాలని లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ ఒంటరి పోరు చేసి విజయ తీరాలకు చేరిందని, సిపిఐని నిలువరించాలనే కుట్రలు చసిన వారికి తీవ్ర నిరాశే మిగిందన్నారు. ఎర్రజెండా పనైపోయిందని కారుకూతలు కూసే వారికి గ్రామ పంచాయితీ ఎన్నికలు చెంపపెట్టని, సిపిఐని లేకుండా చేద్దామని చూసిన అనేక పార్టీలు కాలగర్భంలో కలిశాయని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలను తరలించేందుకు కార్యకర్తలు సైనికుల వలె కృషి చేయాలని సూచించారు. చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిరియాల రంగయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, వై. ఉదయ్ భాస్కర్, మున్నా లక్ష్మికుమారి, కే. సారయ్య, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, రేసు ఎల్లయ్య, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జి. వీరస్వామి, భూక్యా దస్రు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే. ఫహీం. మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాద్యులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)




ఆధ్వర్యంలో ప్రభాతభేరీ మ్రోగించాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శతాబ్ది ఉత్సవ సభ జయప్రదం కోరుతూ ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళల్లో సభ చారిత్రిక నేపథ్యాన్ని వివరించి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఖమ్మం నగరంలో అన్ని ప్రాంతాల్లో బహిరంగ సభ వివరాలు, చారిత్రిక నేపథ్యాన్ని తెలుపుతూ ప్రత్యేక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని నగరం మొత్తాన్ని తోరణాలతో అలంకరించాలని నిర్ణయించారు. ఈనెల మూడు నుంచి ఆరవ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జీబుజాతాలను నిర్వహించాలని నిర్ణయించగా ఈ కార్యక్రమానికి జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మి లు జాతాకు నాయకత్వం వహించనున్నారు. ఈ



జాతాల సందర్భంగా జరిగే సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు హాజరుకానున్నారు. మొత్తంగా ఖమ్మం జిల్లా సమితి సభ జయప్రదం కోరుతూ వినూత్న పద్దతిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లా నలుమూలల నుంచి భారీ సమీకరణకు ఏర్పాట్లు చేయడంతో పాటు ఈ సందర్భంగా ప్రత్యేక కళాజాతాలను రూపొందించనున్నారు. ప్రజా నాట్య మండలి కళాకారులు, డప్పు బృందాలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నాయి.

# ప్రతి పైసా ప్రజల అభివృద్ధి కోసమే ఖర్చు






(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఉపయోగపడేవిధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు.ప్రజా ప్రభుత్వం రైతుల కోసం ప్రతి ఏడాది రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యుత్‌ను వ్యవసాయానికి ఉచితంగా అందిస్తున్నామన్నారు. రూ.13,500 కోట్లు ఖర్చు చేస్తూ 96 లక్షల కుటుంబాలకు మనిషికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలకు ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరలను ప్రజా ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇంటి నిర్మాణాలకు రూ.22,500 కోట్లు కేటాయించామని ప్రతి వారం ఇండ్ల పురోగతి ఆధారంగా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు దేశంలో ఎక్కడలేనివిధంగా మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం కోసం ఆర్టిసి సంస్థకు రూ. 8,600 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఎల్లప్పుడు ఆశీర్వదించాలని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రూ. 2.25 కోట్లతో అనంతసాగర్‌లో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించుకోవడం, రూ. 1.75 కోట్లతో కామంచికల్‌లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఒకే రోజు చేసుకోవడం సంతోషకరమన్నారు. గత పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. గురుకులాల్లో పిల్లలకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. రాబోయే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి, మంత్రి, కలెక్టర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మెన్లు వెన్నపూసల సీతారాములు, హరినాథ్ బాబు, మాజీ ఛైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసా చారి, సిపిఓ ఎ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కోట్ల అవినీతికి నిలువెత్తు నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)



ప్రారంభం నుంచే పనిచేయకపోవడం గమనార్హం. రైతులు పంటలను నిల్వ చేసుకునే అవకాశం లేకుండా కేవలం పేరుకే కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, కోట్ల వ్యయంతో నిర్మించిన అమ్మోనియం ప్లాంట్‌కు అవసరమైన నీటి సరఫరా లేకపోవడంతో ఆ యూనిట్ మూతపడినట్లే ఉందని సమాచారం.నాసిరకం నిర్మాణాలు, ప్రమాణాలకు విరుద్ధమైన పనుల కారణంగా ఫుడ్ పార్క్ సిదిలావస్థకు చేరుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన మిషనరీలు పనిచేయకపోవడం, మోటార్లు తరచూ మొరాయించడం అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపే మౌలిక సదుపాయాలు కూలిపోతున్నా సంబంధిత అధికారులు మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాగితాలపై మాత్రం అభివృద్ధి చూపించి, వాస్తవంగా మాత్రం పనులు జరగలేదని, కోట్ల పనుల్లో భారీగా అవినీతి జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, నాణ్యత లేని పనులకు, ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఫుడ్ పార్క్ అవినీతి వ్యవహారాన్ని ప్రజా ఉద్యమంగా మార్చుతామని ప్రతిపక్షాలు, రైతు సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

## జాతీయ సేవా సమితి ప్రత్యేక శిబిరం ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరుః**



కల్లూరు లోని శ్రీరాంపురంలో శనివారం జాతీయ సేవా సమితి శీతాకాల ప్రత్యేక శిబిరం కళాశాల ప్రిన్సిపల్ షకీల భాను, ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్ట్ కల్లూరు అధికారి వీరభద్రంల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. విశిష్ట అతిథి పసుమర్తి చంద్రరావు మున్సిపాలిటీ శివారులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ముఖ్యఅతిథి జిల్లా ప్రోగ్రామ్ అధికారి నర్సింగ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు పాటు రోజుకో కార్యక్రమం చేపట్టి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్, శ్రీనివాసరావు ప్రసన్న శ్రీనివాసరావు కళావతి రంజిత్ తో పాటు సిఆర్పిలు, ప్రముఖులు మారేశ్ లు విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించారు.

# సాంస్కృతిక, సామాజిక విలువలను పెంపొందించాలి




**-దేశ మౌలిక సంస్కృతిపై దాడి జరుగుతుంది**
**-ఇస్కఫ్ కన్వెన్షన్‌లో హైకోర్టు న్యాయవాది కడారు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశ సంస్కృతి సామాజిక విలువలను పెంపొందించడానికి మేధావులు, కళాకారులు పాటుపడాలని హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం టిటిడిసి భవన్‌లో జరిగిన ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరర్ కో ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ (ఇస్కఫ్) పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఖమ్మం జిల్లా కన్వెన్షన్‌లో హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే అత్యంత విలువైందని దానిని పరిరక్షించుకునేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. భారతదేశం మతాలు, కులాలు, భాషలు, కళలకు నిలయమన్నారు. సోదర భావం, పరస్పర సహకారం భారత సమాజంలో విడదీయరాని బంధమన్నారు. భారత రాజ్యాంగం దేశ సమగ్రతకు, సమైక్యతకు కవచమన్నారు. ఇటీవల దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద విచ్చిన్న శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ముఖ్య సాంప్రదాయంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం మిడి మిడి జ్ఞానంతో కొందరు మా మతమే గొప్ప అంటూ ఇతర మతాలపై దాడులు చేయడం, బోధనలు చేయడం దురదృష్టకరమన్నారు. ఒకవైపు పౌరులు మతాల కోసం కొట్టుకుంటుంటే పాలకులు దేశ సంపదను విదేశాలకు తరలించే పనిలో పడ్డారన్నారు. పేదరిక నిర్మూలన చేశామని పాలకులు చెబుతున్నప్పటికీ దేశంలో 80 కోట్ల మంది రేషన్‌కార్డు కలిగి ఉన్నారంటే దాని అర్థం గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు కొండపర్తి శ్రీనివాసరావు, విజయ లక్ష్మి, ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, ఏఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ప్రజా కళాకారులు పమ్మి రవి, సీనియర్ న్యాయవాది పారుపల్లి అమర్‌చంద్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బత్తుల నర్సింహారావు, మహిళా ప్రాంగణం మాజీ కో ఆర్డినేటర్ నాగసరస్వతి, నగర ప్రముఖులు సాధిక్, తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 18న జరిగే సిపిఐ వందేళ్ల ముగింపు సభను జయప్రదం చేయండి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ**



**పజాపక్షం/బోనకల్:** సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభను జనవరి 18న ఖమ్మంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు, ఈ సభను సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున ఊరూ వాడ కదలి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ పిలుపునిచ్చారు. మండలంలోని రాపల్లిలో శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామ శాఖ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు గాంధీ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26, 1925 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆవిర్భవించిందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్భంధంలో పుట్టి పెరిగిన పార్టీ అని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం రావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రమజీవులు తరపున నిలబడినటువంటి పార్టీ అని తెలిపారు. వేలాది అమరుల త్యాగాలతో ఈ విజయాలు సాధ్యమయ్యామన్నారు. ఉత్సవాలలో రాష్ట్ర నాయకులతో పాటు, జాతీయ, ఇతర దేశ నాయకులు పాల్గొని ప్రసంగించున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు పారుపల్లి నరసింహారావు, బ్రహ్మణపల్లి ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, శాఖ కార్యదర్శి ఏనుగు రామకృష్ణ, గుడిద కృష్ణ, గుడిద నరసింహ, మడుపల్లి వెంకటేశ్వర్లు, చావా గోపాల కృష్ణ, వంగాల శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు కట్టడి చేసేందుకు జిల్లా వ్యాప్తాంగా విస్తృతంగా వాహనతనిఖీలు చేపడుతున్నట్లు పోలీసుకమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా తరలిస్తున్న రేషన్ బియ్యం, ఇసుక, గంజాయి వంటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా వ్యాప్తాంగా పోలీసు యంత్రంగం వాహనతనిఖీలు ముమ్మరం చేసిందన్నారు. రావాణాశాఖ నిబంధనల మేరకు వాహనదృవపత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మద్యం మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నటు పేర్కొన్నారు. అంతేకాకుండా దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికల పై నిఘా పెంచడంతో పాటు అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీచేశామని సిపి వివరించారు. అనుమానులు, అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను నిలువరిచి వివరాలు సేకరించి అనంతరం వారిని విడిచిపెట్టెందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నట్టల మందుల పంపిణీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా మూగజీవాలకు నట్టల నివారణ ముందులను తాగించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కనకతార, ఉపసర్పంచ్ ఏలూరు రమేష్ చేతుల మీదుగా ప్రారంభించగా మండల పశువైద్యాధికారి డాక్టర్ అన్వేష్, పశుసంవర్థక శాఖ సిబ్బంది నాగేంద్రకుమార్, రవికృష్ణ, గ్రామ గోపాల మిత్ర వెంకటేశ్వర్లు, పశు మిత్రలు త్రివేణి, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భూమికోసం, భుక్తికోసం, పీడిత జన విముక్తికోసం నిరంతరం పోరాడిన ఎర్రజెండ పార్టీ సీపీఐ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అమరవీరుల రక్త తర్పణాలతో పోరాడిన పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ కోసం పోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐదేనని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా సుమారు పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐదని, సుమారు నాలుగున్నర వేల మంది అమరవీరుల త్యాగాలతో ఈ ఉద్యమం సాగిందని తెలిపారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సత్తుపల్లి టౌన్ కార్యదర్శి నిమ్మటూరు రామకృష్ణ, మండల కార్యదర్శి తడికమళ్ల యోబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రంజాన్ బి, వేంసూర్ శాఖా కార్యదర్శి షేక్ లాల్ మహమ్మద్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణ, శ్రీహరి, పేరయ్య, శేఖర్, వెంకటేశ్వర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి పరిచయ పరీక్షలో గగన్‌కు ద్వితీయ స్థానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రామాయణ, మహాభారత పరీక్షలో ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించాడు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాలలో సంస్కృతి పరిచయం అనే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రామాయణ, మహాభారత పరీక్షలో సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సర్వజ్ఞ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి నల్లజల్ల గగన్ అసాధారణ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ వారు అందజేసిన షీల్డ్, విలువల నిర్మాణమే జాతి నిర్మాణం అనే నినాదంతో కూడిన ప్రమాణ పత్రాన్ని పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ చేతుల మీదుగా గగన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్షించారు. గగన్ సాధించిన ఈ విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం గగన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# రేగులచలకలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. శనివారం మహత్మ జ్యోతి బాపూలే వెనకబడిన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల రఘునాథపాలెం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్)లో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన శీతాకాల శిబిరాన్ని ప్రిన్సిపాల్ వై. నాగేశ్వరరావు, సర్పంచ్ యండపల్లి రమాదేవి సత్యం లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవాధృక్పథాన్ని అలవర్చుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో ఏడు రోజుల పాటు ఈ శిబిరం ఉంటుందని గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. సర్పంచ్ యండపల్లి రమాదేవి సత్యం మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా విద్యార్థులకు గ్రామ పంచాయతీ తరుపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. శిబిరంలో భాగంగా విద్యార్థినిలు తొలిరోజు గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పొదలను, చెత్తాచెదారాన్ని తొలగించి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆదాం, వార్డు సభ్యులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎన్. స్వాతి, అధ్యాపకులు కె.వినీల, సునీత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** విద్యార్థులు సేవాభావాన్ని, సామాజిక బాధ్యతను పెం పొందించుకోవాలని, ఎన్‌ఎస్‌ఎస్ క్యాం పుల ద్వారా విద్యార్థుల్లో వాటిని పెంపొందించటానికి దోహదపడుతుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నా రు. అశ్వారావుపేట మండలం పాతనారంవారిగూడెం గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వింటర్ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో యువత కీలకమని, పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం సామాజిక అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకుంటే మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఇలాంటి క్యాంపులు ప్రజలకు మేలు చేస్తాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, ఆత్మ కమిటీ ఛైర్మన్, సుంకపల్లి వీరభద్రరావు, సర్పంచ్ మునుగొండ నాగమణి, జూనియర్ కళాశాల సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సేవా సమితి ఆధ్వరర్యంలో భక్తులకు అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల వితరణతో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల వితరణతో ప్రతిరోజూ ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యదర్శి లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే ప్రతిరోజూ వారి పేరు మీద భక్తులకు అన్నదానం చేస్తామని సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థలదాత కొడాలి విజయలక్ష్మి దేవి, అధ్యక్షులు బొబ్బా కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు యిమ్మిడి ఈశ్వర్‌చంద్ర, విద్యాసాగర్, సహాయ కార్యదర్శి చింతా కిషోర్, కోశాధికారి వీరమాచినేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, శ్రీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## క్రీస్తు చూపిన మార్గం గొప్పది



**ప్రజాపక్షం/చింతకాని :** క్రిస్మస్ సందర్భంగా చింతకాని మండల కేంద్రంలో క్రైస్తవులకు ప్రభుత్వం ఇస్తున్న విందు కార్యాక్రమాన్ని శనివారం చింతకాని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. చింతకాని సర్పంచ్ కిలారి మనోహర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. క్రైస్తవులందరూ క్రిస్మస్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు గుడిమల్ల రాజు, కాసాని సత్యపాల్ క్రైస్తవ మత పెద్దలు బాబు ప్రసాద్, ఆర్ కుమార్, తంగిరాల రాజేష్, జోసెఫ్, ప్రకాష్, జాన్‌మార్క్, శౌరీ, రూబేన్ పదవ వార్డు మెంబర్ మాతంగి నాగరాజు పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని చిన్నమండవ సర్పం చ్ పర్చా రామచంద్రరావు పేర్కొన్నారు. శనివారం చిన్నమండవ అంగన్వాడీ కేం ద్రం2 లో జరిగిన ఈసీసీఈ డే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ రామచంద్రరావు మాట్లాడుతూ లెర్నింగ్ మేలా వల్ల చిన్నరుల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, అంగన్‌వాడీ మొదలు, పాఠశాల స్థాయి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తంగిరాల మాధవి, వార్డు మెంబర్లు గుండ్ల భద్ర మ్మ, అనిల్ కుమార్, సోంపొంగు రమణమ్మ, కాశిమాల సరిత, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, జ్యోతి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వరి పంటకు బోనస్ డబ్బులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర ప్రభుత్వం గత రబీ సీజన్‌లో రైతులకు వేయాల్సిన బోనస్ అందించాలని జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ లాల్‌మహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అప్పుల ఊబిలో కూరుకొని పోయేవిధంగా ఉన్నారని, రబీ పంటలు ధాన్య దిగుబడి రాక రైతులు ఆర్థికంగా నష్టపోవడం జరిగిందన్నారు. రైతులు బోనస్ వస్తుందని ఆశతో సన్నరకం ధాన్యం పండించడం జరిగింది. గత సీజన్‌లో రబీ పంటకు బోనస్ వేయకపోగా రైతులకు ధాన్యంలో నాణ్యత లేదని అనధికారికంగా క్వింటాకు ఐదు కేజీల నుండి పది కేజీల వరకు తరుగు తీయడం వలన రైతులు ఒక్కో క్వింటాకు సుమారు రూ.150ల నుండి రూ.200ల వరకు నష్టపోవడం జరిగింది అన్నారు. రైతులకు మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు అయింది. వరి పంట కూడా బోనస్ వేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని లాల్‌మహ్మద్ అన్నారు.

## కోరంను కలిసిన టీడీపీ నేత ముద్రగడ



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కన్నకయ్యను ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ వంశీ, నూతనంగా గెలిచిన టిడిపి విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ పంచాయితీ అభివృద్ధికి సహకారం అందించాలని ఎంఎల్‌ఏను కోరగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, అందరిని కలుపుకొని గ్రామ అభివృద్ధికి పని చేయాలని అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ముందుగా ఎంఎల్‌ఏకు శాలువా కప్పి సన్మానం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రమేష్ బాబుకు శాలువాతో సన్మానం చేసి ముద్రగడ వంశీ, చాందావత్ రమేష్ బాబులకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరం సురేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, టిడిపి నాయకులు కారు నర్సయ్య, దాసరి గోపాలకృష్ణ, గోగ్గేలా రాజేష్, గుగులోత్ రాందాస్, ముక్కు శ్రీవెద్, మాలోత్ రాము, కామ ప్రణయ్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.


## ఎడవల్లి రామిరెడ్డికి నివాళి

**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా శనివారం నాడు వారి స్వగ్రామంలో నిర్వహించిన దశదిన కర్మకు హాజరై రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు బజ్జూరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బానోత్ శ్రీనివాస్‌నాయక్, జూకూరి గోపాల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కంచర్ల జీవన్‌రెడ్డి, బానోతు రామ్‌కుమార్, ఎండి హైమద్ అలీ, చాట్ల పరుశురాం, ధరావత్ సురభి నాయక్, దామళ్ళ పాపారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎడవల్లి రామిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

# ముక్కోటికి ముస్తాబు

- సిద్ధమవుతున్న హంస వాహనం
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్
- కొనసాగుతున్న అధ్యాయనోత్సవాలు





**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు భద్రాచలం ముస్తాబవుతోంది. ఇప్పటికే అధ్యాయనోత్సవాలు కొనసాగుతుండగా ఈ నెల 29న జరిగే తెప్పోత్సవం, 30న జరిగే ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. సు మారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందనే అం చనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు, పారిశుధ్యంతో పాటు వసతి సదుపాయాలను కల్పించనున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారి కోసం తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రత్యేక బస్సు సర్వీసులను తిప్పేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వైకుంఠ ద్వారం వద్ద ఉన్న తలుపులకు మెరుగులు దిద్దుతున్నారు. భక్తులు స్వామిని వీక్షించేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయ పరిసరాల దేదీప్యమానంగా వెలుగులు వెదజల్లుతున్నాయి.

**బలరామావతారంలో స్వామివారు :** వైకుంఠ ఏకాదశి అధ్యనోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అవతారంలో ఉన్న స్వామిని కనులారా చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ముందుగా స్వామికి గర్భగుడిలో ప్రత్యేక అలంకారాన్నిధరింపజేసి పల్లకీలో ఏర్పాటు చేసినవేదిక వద్దకు తోడుకొచ్చారు. ఈసందర్భంగా కోలాట నృత్యాలు, భజన బృంధాల కోలాహలం ఎంతగానో ఆకట్టుకుంది. అవతార రూపుడైన రామయ్యను చూసిన భక్తులు ఒక్క సారిగా జై శ్రీరాం అంటూ రామనామ స్మరణ చేయడంతో ఆ ప్రాంగణంలో భక్తి భావంతో తొనికిసలాడింది. బలరామ అవతారంలోని రామయ్యను దర్శించుకున్న భక్తులు పరవశించి పోయారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

# విద్యాబోధన వ్యాపారంగా మారకూడదు

- తల్లాడ సర్పంచ్ చిన్నబ్బాయి





**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యను వ్యాపారంగా మార్చకుండా నేటి బాలలే రేపటి భారత పౌరులు అనే ఆశయంతో విద్యాబోధన నిర్వహించాలని తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక యూనివర్సల్ విద్యాలయంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 50శాతం ఫీజు తిరిగి ఇవ్వటం చాలా మంచి కార్యక్రమం అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వటం గొప్ప విషయమని అన్నారు. ఎల్‌కెజి నుండి 10వ తరగతి వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సర్పంచ్, ఉపసర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.

### సర్పంచ్, ఉపసర్పంచ్‌కు ఘనసన్మానం...

తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డిలను స్థానిక యూనివర్సల్ విద్యాలయం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని, రాజకీయాలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టికె.ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, జివిఆర్, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వాటర్ ట్యాంక్ పనుల పరిశీలన



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను శనివారం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ ఈ నిర్మాణ పనులు ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా, నాణ్యత ప్రమాణాలకు పూర్తిగా కట్టుబడి చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనుల్లో వేగం పెంచి, నిర్దేశిత గడువులోనే పూర్తి చేయాలని సూచించారు. భగత్ సింగ్ నగర్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం అందేలా ఈ వాటర్ ట్యాంక్ ఉపయోగపడుతుందని పేర్కొంటూ, తాగునీటి సమస్యపై ఇకపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, మౌలిక వసతుల అభివృద్ధిలో రాజీ లేకుండా ముందుకు సాగుతున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకత్వం, నియోజకవర్గ అభివృద్ధికి బలమైన దిశానిర్దేశం చేస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిఈ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ వి. శ్రీనివాస రావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అరుంధతి, మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు రహీం పాషా, మండల ముఖ్య నాయకులు, మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడే కిన్నెరసాని బాలుర గురుకులం స్వర్ణోత్సవాలు



- ఉత్సవాలకు సర్వం సిద్ధం
- హాజరు కానున్న 3000 మంది పూర్వ విద్యార్థులు
- ఎందరో ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దిన కిన్నెర గురుకులం
- దేశ విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎందరో విద్యార్థులను ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దిన కిన్నెరసాని డ్యాంసైట్ బాలుర గురుకుల పాఠశాలలో 50 ఏండ్లు పూర్తయిన సంధర్భంగా అంగరంగ వైభవంగా నేడే స్వర్ణోత్సవాలు జరిపేందుకు సర్వం సిద్ధం చేశారు. ప్రసార మాధ్యమాలలో విరివిరిగా ప్రచారం చేశారు. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సైతం చిన్నతనంలో చదువుకొన్న బడిని చూడటానికి, స్వచ్ఛ వాతావరణాన్ని, కిన్నెరసాని అందాలను ఆస్వాదించడానికి రానున్నారని నిర్వాహకులు తెలిపారు. సుమారు 3000 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారు. దీనికి 16 కమిటీలను వేసి పక్కా ప్రణాళికను రూపొందించారు. తాము చదువుకొన్న పాఠశాలను మరచిపోకుండా అభివృద్ధికి ముందుకొస్తున్నారు. పాఠశాల విద్యార్థుల సౌకర్యం కోసం 1,25,000/లతో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కిన్నెర బ్యాంక్ మేనేజర్ జి. నాగేశ్వరరావు ముందుకొచ్చారు.

**- కిన్నెర పర్యాటక కేంద్రం :** రాష్ట్రంలో పేరొందిన పర్యాటక ప్రాంతంలో కిన్నెరసాని జలాశయం ఒకటి. పాల్వంచ పట్టణానికి 12 కిలో మీటర్ల దూరంలో పచ్చటి చెట్లు, కొండల నడుమ చక్కని, ఆహ్లాదకరమైన వాతావరణంలో గల కిన్నెరసాని డ్యాంసైట్ లో ఏపి రెసిడెన్సియల్ ఎడుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన బాలుర రెసిడెన్సియల్ పాఠశాలను 1975వ, సంవత్సరంలో ఏర్పాటు చేశారు. 1976వ, సంవత్సరంలో భవన నిర్మాణాలకు పూర్వ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, కేంద్రమంత్రి సంజయ్‌గాంధీలు శంఖుస్థాపన చేశారు. అప్పటి నుండి 50 యేండ్ల కాలంలో 45 బ్యాచీలు పూర్తి కాగా ఒక్కో బ్యాచ్‌కు 80 మంది విద్యార్థుల చొప్పున దాదాపు 3,500 మంది విద్యను పూర్తి చేశారు. కిన్నెరసాని గురుకుల పాఠశాలలో సీటు దొరికితే జాబ్ గ్యారెంటీ అనే వారు. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పాఠశాలలో విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉందని ఇతరులకు ఆదర్శంగా నిలబడ్డారు.

**- తల్లిదండ్రుల సపోర్ట్ :** ఆనాడు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కొండంత సపోర్ట్ ఇచ్చేవారు. ఏమైనా చేయండి మా పిల్లలకు మంచిగా చదువు రావాలి అనేవారు. చదువులో వెనకబడ్డ విద్యార్థులను ఆడపాదడపా దండించేవారు. అయినా తల్లిదండ్రులు టీచర్లను సమర్థించేవారు. చదువులో చురుగా ఉంటే టీచర్లు కొట్టరు కదా అని వారి పిల్లలను మందలించేవారు. టీచర్లు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని చదువులో రాణించాలని తమ పిల్లలకు ఆత్మ విశ్వాసాన్ని నింపేవారు. పేరెంట్స్ చదువు పట్ల, ఉపాద్యాయుల పట్ల గౌరవంగా ఉండేవారు. దానితోనే ఉపాద్యాయులు ఆత్మ విశ్వాసంతో విద్యాభోధన చేసేవారు. చదివిన పలువురు విద్యార్థులు విద్యలో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులను వేసుకొన్నారు.వాసం రామక్రిష్ణ దొర లాంటి వారు రాజకీయాలలో చరుగ్గా పాల్గొంటున్నారు.

**- దేశ విదేశాల్లో స్థిర నివాసం :** కిన్నెరసాని డ్యాంసైట్ గురుకుల పాఠశాలలో చదువుకొన్న విద్యార్థుల్లో పలువురు అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, సింగపూర్, మస్కట్ లాంటి విదేశాలలో పలు ఉద్యోగులుగా, సైంటిస్టులుగా తమ సేవలను అందిస్తున్నారు. మరికొందరు దేశంలోని వివిధ రాష్ట్రాలలో పోలీస్, ఉపాద్యాయులు, బ్యాంకు ఉద్యోగులుగా ప్రజలకు సేవలను అందిస్తున్నారు.

**- నాలుగు రోజులుగా :** కిన్నెరసాని గురుకులంలో విద్యాబోధన చేసి హైదరాబాద్‌లో స్థిరపడిన పూర్వ ఉపాధ్యాయులైన ఎస్. ఖాదర్, నల్లాన్ చక్రవర్తుల చక్రవర్తి, తీగల రమేష్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనే నలుగురు తమ వయసును కూడా లెక్క చేయకుండా స్వర్ణోత్సవాలను విజయవంతం చేసేందుకు నాలుగు రోజులుగా మకాం వేసి ఏర్పాట్లను చేస్తుండటం తాము విద్యాబోధన చేసిన పాఠశాల పట్ల తమకున్న అపారమైన గౌరవం, ప్రేమను చూపెడుతుండటం విశేషం.వీరితో పాటుగా పూరవ విద్యార్థులు తమ సేవలను అందిస్తున్నారు.

**- ఏర్పాట్లు పూర్తి :** పాఠశాలను నెలకొల్పి యాభై సంవత్సరాలు పూర్తి కావస్తున్న సంధర్భంగా నేడు జరిగే స్వర్ణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సుమారు మూడువేల మంది పూర్వ విద్యార్థులు కలికట్టుగా నడుంబిగించారు. ఉత్సవాలను విజయవంతం చేయటం కోసం ర్యాలీలు, ప్రసారమాధ్యమాలలో ప్రచారం చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఫోటో గ్యాలరీ, సావనీర్, 50 సంవత్సరాల గుర్తుగా పైలాన్, ఫోటో సెల్ఫీపాయింట్‌లను ఏర్పాటు చేశారు.



**రమేష్ రాథోడ్ :** మండల పరిధి పాండురంగాపురం గ్రామానికి చెందిన రమేష్ రాథోడ్ ప్రభుత్వ టీచర్‌గా పని చేస్తున్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛతను అందించటానికి 2010లో గ్రీన్‌ఎర్త్ సొసైటీని స్థాపించారు. వాతావరణ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కలిస్తూ పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# ఈపి ఆపరేటర్ల ఏ గ్రేడ్ పదోన్నతుల ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలి

మణుగూరు ఏరియా ఎస్ఓటు జిఎం బి. శ్రీనివాసచారికి ఆపరేటర్ల వినతి



**ప్రజాపక్షం/మణుగూరు:** కొత్తగూడెం రీజియన్ స్థాయి ఈపి ఆపరేటర్ల ఎక్స్ కా వేషన్ "ఏ" గ్రేడ్ పదోన్నతుల ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం ఏరియా ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో ఏరియా ఎస్ ఓ టు జిఎం బి శ్రీనివాసచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ల సంఘం నాయకులు యస్‌డి. నాసర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం రీజియన్ స్థాయిలో మణుగూరు కొత్తగూడెం సత్తుపల్లి ఇల్లెందు ఓసి గనులలో పనిచేస్తున్న ఆపరేటర్లకు సంబంధించి "బి" గ్రేడ్ లో మూడు సంవత్సరాల పాటు సర్వీసు పూర్తి చేసి అర్హులైన ఆపరేటర్లకు ఎక్స్ కా వేషన్ క్యాటగిరి "ఏ" గ్రేడ్ పదోన్నతి కల్పించవలసి ఉందని, దీనికై ఏరియా యాజమాన్యం కొత్తగూడెం కార్పొరేట్ యాజమాన్యంతో సమన్వయం చేసుకొని ఏ గ్రేడ్ పదోన్నతుల ఖాళీకి నోటిఫికేషన్ విడుదల చేయవలసి ఉందని ఆ దిశగా మణుగూరు యాజమాన్యం తగు చర్యలు చేపట్టాలని ఓసి గనులలో ఉత్పత్తి ఉత్పాదకతలలో ముందు వరుసలో ఉండే ఈ పి ఆపరేటర్లకు సకాలంలో పదోన్నతులు కల్పించేందుకు ఏరియా యాజమాన్యం చొరవ చూపాలని వినతిపత్రంలో ఆపరేటర్లు కోరారు.

# నూతన పాలకవర్గ సభ్యులకు సత్కారం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మణుగూరులో జరిగిన అభినందన సభలో ఈనెల 11వ తేదీన జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం, పినపాక, ఉప్పుసాక, మోరంపల్లిబంజర్, బూర్గంపాడు, సారపాక, లక్ష్మీపురం, నకిరిపేట, గ్రామ పంచాయితీలలో బిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన పలువురు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, గ్రామ పంచాయితీలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. తన వంతుగా ఎప్పుడు అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సాయి కుటుంబానికి ఆర్థికసాయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక నివాసి మామిడాల సాయి వెంకట్రాం అయ్యప్ప స్వామి మాల(కన్నెస్వామి)వేసుకుని మాల విరమణ నిమిత్తం శబరిమలై వెళ్లి అయ్యప్ప దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రం గా గాయాలపాలై కేరళ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సారపాక మాజీ సర్పంచ్ ధారావత్ చందునాయక్ సాయి కుటుంబ సభ్యులకు రూ 40వేలను అందించి ధైర్యంగా ఉండాలని, త్వరలోనే సాయి కోలుకుంటాడని అన్నారు. సారపాకలో వైష్ణవి మిల్క్ డిస్ట్రిబ్యూటర్‌గా అందరికీ సుపరిచితుడైన యువకుడు సాయి అని అన్నారు. ఈకార్యక్రమంలో ఝర్పలా భద్రు, గాదె శ్రీనివాస్‌రెడ్డి, గుగులోత్ రాంబాబు, తేజావత్ ప్రేమ్ కుమార్, ఆంగోత్ కిషన్, గుగులోత్ గణేష్, గుగులోత్ విక్రమ్, భూక్య డేవిడ్, నూణావత్ రాజు, భూక్య హరిలు ఉన్నారు.

## బిఆర్ఎస్ ఉప్పసాక గ్రామ అధ్యక్షునిగా రామకృష్ణ నియామకం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఉప్పుసాక గ్రామానికి చెందిన ధరావత్ రామకృష్ణని బిఆర్ఎస్ పార్టీ ఉప్పుసాక గ్రామ అధ్యక్షులుగా పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు నియమించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ధరావత్ రామకృష్ణ ఒకట విద్యావంతుడు, పరిశ్రమల రంగంలో అనుభవం కలిగిన వ్యక్తిగా, సమాజంలో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ముఖ్యంగా యువతకు ఆయన ఒక ఆదర్శప్రాయుడుగా నిలుస్తూ, పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయగల సామర్థ్యం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ ఆశయాలకు అనుగుణంగా అంకితభావంతో పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రామకృష్ణ కీలక పాత్ర పోషిస్తాని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నియామకానికి పార్టీ అధిష్టానం, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావుకి ధరావత్ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు పూర్తి నిబద్ధతతో పని చేస్తానని ఈసందర్భంగా తెలిపారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షునిగా మహంకాళి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులుగా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ మహంకాళి రామారావుని నియమిస్తూ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాములు నాయక్ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనకు జిల్లా అధ్యక్షులుగా బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రాములు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎన్నికైన ఉప సర్పంచులకు ప్రతినిధిగా అప్పగించిన బాధ్యతను ఉప సర్పంచుల గౌరవాన్ని తగ్గించకుండా గ్రామాల అభివృద్ధిలో పోటీ పడి మంచి పేరు తెచ్చుకునే విధంగా ఉప సర్పంచ్‌లు అందరిని సంఘటితం చేస్తానని పేర్కొన్నారు. గ్రామ పంచాయితీలలో ఉప సర్పంచులకు ప్రత్యేక ప్రోటోకాల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరతామని పేర్కొన్నారు.

## సర్పంచ్ వీరప్రతాప్‌కు ఘనసన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** నూతనంగా కారేపల్లి సర్పంచ్‌గా గెలుపొందిన కారేపల్లి సర్పంచ్ మేదరీ వీరప్రతాప్‌ని కళాశాలకు ఆహ్వానించి ప్రిన్సిపల్ ఎన్ విజయ కుమారి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సర్పంచ్ మేదరీ వీరప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థులు రేపటి నాయకులు ప్రజాస్వామ్యంలో విద్యార్థులు కీలకమైన పాత్ర అని, విద్యకు, వైద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ విజయకుమారి, సుధారాణి, శ్రీనివాస్, వేణు, దుర్గాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎడవల్లి రామిరెడ్డికి కందాళ నివాళి



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని పాలేరు గ్రామం నందు శనివారం నాడు జరిగిన ఎడవెల్లి రామిరెడ్డి దశదిన కార్యక్రమానికి పాలేరు మాజీ ఎంఎల్‌ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. నివాళులర్పించిన వారిలో కూసుమంచి మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- 9 నెలల కాలంలో సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణ పనులు పూర్తి
- ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వరంగల్‌క్రాస్‌రోడ్‌లో మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని తరుణిహాట్‌లో నిర్మాణం చేయనున్న మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయానికి జిల్లా కాలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...పేద ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అభివృద్ధి పనులు కూడా ఎక్కడ తగ్గకుండా ప్రజా ప్రభుత్వం చేపడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగా లేకపోయినా ఖమ్మం రూరల్ మండలంలో కార్యాలయ సముదాయ నిర్మాణ పనులు రూ.45కోట్లతో చేపట్టామని, వీటిని 8నుంచి9నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందించాలని అన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీ అభివృద్ధికి గత 2 సంవత్సరాల కాలంలో 221కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలో అవసరమైన రోడ్లు, డ్రైయిన్, త్రాగునీటి సరఫరా, ఇతర పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజా సంక్షేమమే, ఎజెండాగా ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నెరవేర్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద ప్రజలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు తదితరు కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. పేదల ఆత్మగౌరవంగా భావించే సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లులు రెగ్యులర్గా చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. అలాగే మరో విడత ఇందిరమ్మ ఇండ్లను ఏప్రిల్ నుంచి మంజూరు చేయనునున్నట్లు తెలిపారు. అనంతరం ఖమ్మంరూరల్ మండలంలోని 129మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, అర్అండ్‌బి ఎస్ఇ యాకోబు, ఆర్డీఓ నరసింహారావు, ఆర్అండ్‌బి ఇఇ పవర్, మున్సిపాలిటీ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, ధరావత్ రామ్మూర్తి, తమ్మినేని నవీన్, భూక్య సురేష్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, వెంపటి రవి, తదితరులు పాల్గొన్నారు.

## మేడా శంకరయ్య, సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్ఈడి లైట్ల వితరణ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని విప్పలమడక గ్రామపంచాయతీకి మేడా శంకరయ్య, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.75వేలు విలువ చేసి 100 వాట్స్ ఎల్ఈడి బల్బులను శనివారం వితరణగా అందించారు. విప్పలమడక గ్రామ సర్పంచ్ మేడా హెమీమా చక్రపాణి గ్రామ కార్యదర్శి ధనమ్మలకు 50 ఎల్ఈడి లైట్లను శంకరయ్య, సుశీలమ్మ కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హెమీమా చక్రపాణి మాట్లాడుతూ మేడా శంకరయ్య, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో విప్పమడక గ్రామ అభివృద్ధికి ఈ ట్రస్ట్ మరింత కృషి చేస్తుందని ఆకాంక్షించారు. విప్పలమడక గ్రామానికి వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్స్‌ను అందించేందుకు ఆ క్లబ్ ప్రతినిధులు అంగీకరించారని చెప్పారు. రెండు రోజుల్లో ఎల్ఈడి లైట్లను గ్రామంలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, మాజీ ఎంపిటిసి ఆకుల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ కొల్లికొండ వీరభద్రం, గోసు కృష్ణయ్య, మేడా సంపత్, మేడా సూర్యనారాయణ, రుద్రాక్షల రాంబాబు, వీరపనేని తిరుపతయ్య, మోతుపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయం : ఎస్సై



**ప్రజాపక్షం/వైరా:** వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని వైరా ఎస్సై పుప్పాల రామారావు అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీలోని పదో వార్డు గండగలపాడులోని ప్రేమజ్యోతి ప్రేయర్ హాల్‌లో హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుందని ఈ చలి తీవ్రత నుండి వృద్ధులకు కాపాడుకోవడం కోసం దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమాజంలోని అవసరమైన వర్గాల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, అవి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు. మనం డబ్బుతో మాత్రమే జీవించడం కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మన తర్వాత కూడా ప్రజల హృదయాల్లో జీవించగలమని ఆయన పేర్కొన్నారు. అనంతరం హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంతగాని నానయ్య, పంతగాని ప్రసాద్‌లను ప్రేమజ్యోతి ప్రేయర్ హాల్ పాస్టర్ ఏసుదాస్‌తో పాటు సంఘం శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.కృష్ణ, కిన్నెర వీరయ్య, పూర్ణకంటి రామారావుతో పాటు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన లింగాల



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని పలు కుటుంబాలను మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు పరామర్శించారు. శనివారం మధిర టౌన్ పరిధిలోని 9, 19, 21 వార్డుల నందు పర్యటించారు. ముందుగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్టాఫ్ యాగప్ప సోదరి ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించారు. అనంతరం బలుగూరి ఆదాం భార్య ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వారిని పరామర్శించారు. అనంతరం ఇటీవల పగడాల నాగమణి భర్త గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆతర్వాత కమతం ప్రవీన్ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం 9వ వార్డులో ఇటీవల మృతి చెందిన లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల అధినేత మండూరి నారాయణరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బిఆర్ఎస్ జిల్లా నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, యన్నంశెట్టి అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, దిరావత్ మాధవి, పల్లపాటి కోటేశ్వరరావు, ఆళ్ళ నాగబాబు, వేల్పుల శివ, చీదిరాల రాంబాబు, పరిస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని రొంపిమళ్ళ గ్రామంలో కొన్ని రోజుల నుండి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జనవాసాల మధ్య మట్టి క్వారీ ఏర్పాటు చేసి మట్టిని తరలిస్తున్న లారీలను శనివారం గ్రామస్తులు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామవాసులు నివసించే ఇళ్ల మధ్యలో 50 అడుగుల లోతులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్వారీ చేస్తున్నారని, పెద్ద పెద్ద గుంతలు పెడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దీని వలన గ్రామస్తులకు భవిష్యత్‌లో నష్టం జరుగుతుందని, పశువులు, చిన్న పిల్లలు తెలియక ఆ గుంతలో పడి మరణించే అవకాశం ఉందని, ఎస్సీ కాలనీ ప్రజల ఇళ్లు కూలిపోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా క్వారీ ఏర్పాటు చేసి మట్టి తోలకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి తుమ్మల పర్యటన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు సత్తుపల్లి మండలంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గంగారం అభివృద్ధి ప్రదాత దాసరి మధు మోహన్ రెడ్డి సొంత నిధులతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పంచాయతీ కార్యాలయం, పలు వార్డులలో డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంఖుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతో పాటు సత్తుపల్లి శాసనసభ్యులు రాగమయి, రాష్ట్ర నాయకుడు దయానంద్, సర్పంచ్ కాకర్ల రేవతి, దాసరి మదుమోహన్ రెడ్డి పాల్గొననున్నారు.

## షిర్డి పాదయాత్ర భక్తులను కలిసిన ధూపాటి



**ప్రజాపక్షం/ తల్లాడ :** శివాజీ షిర్డి సాయిబాబా సేవాశ్రమం, సాయి వరలక్ష్మీ వంద అడుగుల ఎత్తు గల సాయి కోటి మహాస్థూపం లక్ష్మీ పురం గార్డెన్స్, పేద వేగి మండలం ఏలూరు జిల్లా నుండి షిర్డి వరకు 45 రోజులు 1050 కిలోమీటర్ల షిర్డి సాయి పాదయాత్ర ప్రయాణం శనివారం తల్లాడకు చేరింది. షిర్డి పాదయాత్ర భక్తులను ఎఎంసి మాజీ చైర్మన్ ధూపాటి భద్రరాజు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిభక్తులతో బయలుదేరిన వివరాలు అడిగి తెలుసుకుని కాలినడకన షిరిడి వెళ్లా పాదయాత్ర చేస్తున్న సాయి భక్తులకు జాగ్రత్తగా వెళ్లి సాయిబాబాను దర్శించుకుని క్షేమంగా ఇంటికి చేరుకోవాలని పలు సూచనలు చేసి వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సాయి భక్తులు మాట్లాడుతూ ఈరోజు రాత్రి వైరా అయ్యప్పస్వామి ఆలయంలో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర భక్తులు పాల్గొన్నారు.

## తహశీల్దార్, ఎంపిడివోను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్‌లు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం నారపనేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, ఖానాపురం సర్పంచ్ భూక్యా బాలాజి శనివారం వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావుతో కలిసి తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడివో సక్రియను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారపనేనిపల్లి సెక్రటరీ మానస భవాని, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, షేక్ రఫి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

### సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ తుళ్లూరు నిర్మలకుమారి అన్నారు. శనివారం గ్రామంలోని ఎస్టీ కాలనీని వార్డు సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీలో సమస్యలను కాలనీ వాసులు సర్పంచ్ నిర్మలాకుమారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భూక్యా బాలాజీ, పాతూరు వెంకట్రావు, గ్రామ కార్యదర్శి కుమార్, పంచాయతీ సిబ్బంది కృష్ణారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆడిపాడిన గోదారి తీరం

- ఉత్సాహభరితంగా ఏరు ఫెస్టివల్
- నదుల పట్ల అవగాహన కల్పించేందుకే : కలెక్టర్





ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం గోదావరి తీరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఏరు ఫెస్టివల్‌తో గోదారి తీరమే ఆడిపాడినట్లు అయింది. నదీ హారతి పడుతుండగా సంధ్యా సూరీడు మరింత వెన్నతో భూమాత ఒడిలోకి ఒదిగి పోయాడు. ఈ సందర్భంగా కరకట్ట ప్రాంగణం అంతా నృత్యాలు, ఆటలు, పాటలతో మార్మోగింది. విద్యార్థినీ విద్యార్థుల్లో దాగున్న సృజన్మాక శక్తిని వెలికి తీసేందుకు, నదుల పట్ల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఆధ్యాంతం సందడిని నింపింది. ఏరు ఫెస్టివల్‌లో క్లాస్ మోటో పర్ఫార్మెన్స్ చూడముచ్చటగా ఉంది, విద్యార్థులంతా ఒకే వేదిక వద్దకు చేరుకుని సందడి చేసిన తీరు చూపరులను కూడా స్టెప్పులేయగా, జిల్లా కలెక్టర్ చొరవత సాగిన ఏరు ఫెస్టివల్ విజయవంతమైంది.ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ నదుల సంరక్ష, ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం అన్నారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఈనెల 22న నుండి వివిధ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించినట్లు చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో విద్యార్థినీ విద్యార్థులు కళానైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా మేధోశక్తి పెరుగుతుందని, పది మందిలో ప్రదర్శన చేసే అవకాశం దక్కుతుందన్నారు. అదే స్ఫూర్తితో జరిగే స్టేజ్ ప్రోగ్రాంలో చక్కటి ప్రదర్శన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ దొర,దేవస్థానం ఇఓ దామోదర్ రావు, తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, యువజన క్రీడల అధికారి పరంధామిరెడ్డి, ఇరిగేషన్ డిఇ వెంకటేశ్వర్, ఏఇ వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆచారాలు కనుమరుగు కాకుండా చూడటం అభినందనీయం

- ఐటిడిఏ పిఓ కృషి మరువలేనిది





ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగు కాకుండా మ్యూజియాన్ని ఏర్పాటు చేసి అందులో పొందు పరచటం అభినందనీయమని, ఇందుకు ఐటిడిఏ పిఓ చేస్తున్న కృషి మరువలేనిదని దివ్య హైస్కూల్ ప్రిన్సిపల్ కేవి రమణ, ఏ భారతి అన్నారు. శనివారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని పాఠశాలకు చెందిన 170మంది విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. అందులో పొందు పరిచిన కళాకండాలను తిలకించి ఆహ్లాదంగా గడిపి ఆటలాడుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మూల వాసుల ఆచారాలు, పద్ధతులు సంస్కృతి సంప్రదాయాలు కళ్లకట్టినట్లు తెలిపే విధంగా ఏర్పాటు చేసి వాటి చరిత్ర విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో తెలుగులో ముద్రించి వాటి వద్ద ఉంచడంతో చక్కటి అవగాహన కలుగుతోందన్నారు. మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థినీ విద్యార్థులకు ఆటవిడుపు కలిగించటం బాగుందన్నారు. ఐటిడిఏ పిఓ కోయ భాషను నేర్చుకుని భాష ఆంతర్యాన్ని గిరిజనులు మర్చిపోకుండా చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు విజయలక్ష్మి , భారతి, రెహమాన్, ఖాసీం, నరేష్, విజయరావ్, నిర్వాహకులు వీరస్వామి, మాధవి, చలపతిరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు టిజిఎస్ ఆర్టిసి కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. సోలోమన్ తెలిపారు. శనివారం ఖమ్మం రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. సోలోమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, రోజు వారి నడపాల్సిన బస్సులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, జాతర విధులు నిర్వహించే ఉద్యోగులకు మౌలిక సదుపాయాల కల్పన, గత అనుభవాలపై చర్చించారు. ఈ సందర్భంగా సోలోమన్ మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరైన సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులకు ఎటువంటి రవాణా ఇబ్బందులు కలుగకుండా ఆర్టిసి ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయం చేసుకుని భక్తులకు సేవలు అందించాలన్నారు. భక్తులకు రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. రోజు వారి బస్సులతో పాటు జాతర సమయంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి జాతరకు బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ జ్యోత్స్న, పర్సనల్ ఆఫీసర్ సంపత్, డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం ఆందోళనలు వద్దు



ప్రజాపక్షం/కల్లూరు: యూరియా కోసం రైతులు ఆందోళన చేయవద్దని అందుబాటులో కల్లూరు, కొర్లగూడెం, చెన్నూరు, పోచవరం, చిన్న కోరుకొండి, సొసైటీలలో తో పాటు మరికొన్ని కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, రైతు పాసుబుక్కు ద్వారా ఆధార్ కార్డు పట్టాదార్ పాస్బుక్ జిరాక్స్ తీసుకొని ఆయా కేంద్రాల వద్ద పొందాలని వ్యవసాయ శాఖ అధికారిని రూప రైతులను కోరుతున్నారు. కల్లూరు సొసైటీలో 15 మెట్రిక్ టన్నులు, చెన్నూరులో 75, కొర్లగూడెంలో 35, పోచవరంలో 35 , చిన్న కోరుకొండిలో 15 మెట్రిక్ టన్నులు, యూరియా అందుబాటులో ఉందని మరికొన్ని దఫాలు వారీగా యూరియా సొసైటీల ద్వారా అందిస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు సూచించారు. పూర్తి సమాచారం కోసం ఆ రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో కల్లూరులోని జాతీయ రహదారిపై శనివారం యూరియా కోసం రాస్తారోకో చేశారు.

## దళ్‌సింగ్, లక్కినేనిలను అభినందించిన కేటీఆర్



ప్రజాపక్షం/ఇల్లందు: ఇటీవల గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరిన ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు భూక్యా దళ్ సింగ్ నాయక్, మాజీ సొసైటీ ఛైర్మన్ లక్కినేని సురేందర్‌లను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన కేటీఆర్‌కు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరిచయం చేశారు. ఈసందర్భంగా దళ్‌సింగ్, సురేందర్‌లు భద్రాచలం రామాలయం నుండి ప్రత్యేకంగా తెచ్చిన స్వామి వారి శాలువ, లడ్డు ప్రసాదాన్ని యువనేత కేటీఆర్‌కు అందజేశారు. అనంతరం కేటీఆర్ ఇరువురు నేతలను అభినందిస్తూ, మీ చేరిక బిఆర్ఎస్‌కు మరింత బలం చేకూర్చిందని, రాబోయే రోజుల్లో ఇల్లందు నియోజకవర్గంలో బిఆర్ఎస్‌ను తిరుగు లేని శక్తిగా తీర్చిద్దాలని సూచించారు. ఈసందర్భంగా ఇల్లందు మాజీ ఎంఎల్ఏ బానోత్ హరిప్రియ నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, తదితరులు ఉన్నారు.

## సర్పంచులను సన్మానించిన రేగా



ప్రజాపక్షం/గుండాల : ఈ నెల జరిగి సర్పంచి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచి , ఉప సర్పంచులను బిఆర్ఎస్ పా ర్టీ జిల్లా అధ్యక్షులు మాజిశాసన సభ్యులు రేగ కాంతారావు శనివారం మనుగూర్‌లో నిర్వహించిన అభినందన సభలో ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స ర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రా మ పంచాయితీ అభివృద్ధికి పాటు పడాలని, రాబోయే జెడ్పిటీసి, ఎంపిటీసి ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రోల్లగడ్డ పంచాయితి సర్పంచిగా గెలిచిన భూక్య మంగమ్మ, ఉపసర్పంచి తాటి పాపరావులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమం లో నాయకులు తెల్లం భాస్కర్, గడ్డం వీరన్న, సయ్యద్ అజ్జు, భూక్య శ్రీను, బావ్‌సింగ్ ఉన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురంలోని అమ్మగారిపల్లి పరిధిలో గోదావరిలోని ఇసుకను అక్రమంగా తోలుతున్న విషయాన్ని గ్రామస్తులు గుర్తించి రెవెన్యూ అధికారులకు చెప్పడంతో మండల తహసీల్దార్ మణిధర్ వెంటనే స్పందించి రెవెన్యూ అధికారులను సంఘటన స్థలానికి పంపించి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న కుమ్మరిగూడెంకు చెందిన పాయం నాగేశ్వరరావుకు సంబంధించిన ట్రాక్టర్‌ను వారి పరిధిలోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈకార్యక్రమంలో జిపిఓ లక్ష్మ ణ్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లోక రక్షకుడు ఏసుప్రభు : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జూలూరుపాడు: లోక రాక్షకుడు ఏసుప్రభూ అని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పడమటి నర్సాపురం గ్రామంలోని ఇమ్మానియేలు ప్రార్ధన మధిరం లో ఏర్పాటు చేసిన క్రిస్టియన్స్ ఫిస్ట్ వేడుకలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడారు. అన్ని మతాల వారికీ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే సంక్షేమ పథకాలను అందుతాయని అన్నారు. మండలం లోని పాస్టర్ లకు దుస్తులు పంపిణీ చేశారు. అర్హులైన వారికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నారు. కార్యక్రమానంతరం పాస్టర్ లు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమం లో తహశీల్దార్ శ్రీనివాస్, సూపరిండెంట్ తాళ్లూరి రవి, మండల నర్సాపురం సర్పంచ్ సంఘం లక్ష్మి కుమారి,పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని పాత సెంటర్ పెట్రోల్ బంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రి బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు అన్నారు. గాయత్రి బ్యాంక్ ప్రారంభం చేసిన అనంతరం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు గాయత్రి బ్యాంక్ సేవలు అందుబాటులో ఉంటాయని వైరాలో 70% ప్రారంభించడం జరిగిందని, 2000 సంవత్సరంలో ప్రారంభించబడిన గాయత్రి బ్యాంక్ ప్రస్తుతం మల్టీ స్టేట్ బ్యాంక్‌గా రూ.3870కోట్ల వ్యాపారాన్ని తెలుగు రాష్ట్రాల్లో 69 బ్రాంచ్‌లలో రోజురోజుకి అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, కొప్పురావూరి వెంకటకృష్ణ, బ్రాంచ్ నిర్వాహకులు, రీజనల్ అధికారి కోటా శ్రీనివాసులు, రహమతుల్లా, పలువురు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఏడాది కాలంలో 326 మంది మావోయిస్టుల లొంగుబాటు

**- సుమారు రూ.30 కోట్ల గంజాయి స్వాదీనం**
**- 2025 మీడియా సమావేశంలో ఎస్‌పి రోహిత్ రాజ్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 326 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం 2025 మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పనితీరు ప్రశంసనీయం అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 9.65 శాతం నేరాలు పెరిగాయని, గత ఏడాది 5636 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 6180 కేసులు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని, జిల్లా వ్యాప్తంగా రూ.28.54 కోట్ల విలువచేసే గంజాయి పట్టికున్నట్లు చెప్పారు. చోరీలకు సంబంధించి 307 కేసుల్లో రూ.3,75,10,691 సొత్తు ల్లోగారూ.1,21,99,297 లను రికవరీ చేసినట్లు, ఇందులో సీనియర్ పోలీసుల పాత్ర కీలకం అన్నారు. లోక్ అదాలత్ ద్వారా 20595 కేసులు పరిష్కారమయ్యాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ 15347 కేసులు, సైబర్ క్రైమ్ 196 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇందులో 1824 కేసులు పరిష్కారానికి నోచుకున్నాయని, ఏడుగురికి జీవిత ఖైదు, ఇద్దరికి 20 సం. జైలు శిక్షణ, ఐదుగురికి పది సం. జైలు శిక్ష, ముగ్గురికి ఏడు సం. జైలు శిక్ష ఖరారు అయిందన్నారు. కాబోయే ఏడాదిలో సిబ్బంది మరింత పట్టుదలతో పనిచేసి జిల్లా పేరు ప్రతిష్ఠలను మరింత నిలబెట్టాలని, నేరాల అదుపులో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఇల్లందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.


# నేడు భట్టి పర్యటనను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క ఆదివారం మధిర పట్టణంలో పర్యటించనున్నారని, భట్టి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణ గుప్తా కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10గంటలకు స్థానిక క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, పట్టణ డివిజన్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

# సీలింగ్ భూమికి రెక్కలు.. ద్వారం తెరిచిన రెవెన్యూ అధికారులు..!





GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE TAHSILDAR:: PENUBALLI MANDAL

Dt: 27.12.2025

From,
Sri.S.Srinivas Yadav
Tahsildar,
Penuballi Mandal.

To,
The Sub Collector
Kalluru Division

Respected Sir,

1. **Suspension of Prior Orders:**
2. **Revocation of Digital Signature:**
3. **Status Reinstatement:**

Yours faithfully,
Tahsildar
Penuballi Mandal

Copy submitted to the District Collector, Khammam for favour of information.

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ప్రభుత్వ భూమిని, సీలింగు, పోరంబోకు ఇలా అనేక రకాలైన ప్రభుత్వ భూములను కాపాడవలసిన రెవెన్యూ అధికారులు ఇతరులకు భూ బాధలాయింపు చేసి విషయం బయటకు పొక్కటంతో నాలక కరుచుకున్న రెవిన్యూ అధికారుల లీలలు వెలుగులోకి రావడంతో మండలంలో చర్చనీయాంశం అయింది. వివరాల్లో కెళ్తే.. మండల పరిధిలోని చింతగూడెం రెవెన్యూ గ్రామంలో 71 /4 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ సుమారు 3 ఎకరాల 30 కుంటల భూమిని రెవిన్యూ గుర్తించింది. 2023 లో ప్రభుత్వం రెవెన్యూ ద్వారా సర్వే చేసి ఇది ప్రభుత్వ భూమి ఎవరూ ఆక్రమించరాదని బోర్డు ఏర్పాటు చేసింది. కానీ ఆ భూమి పై కన్నేసిన కొందరు చేజిక్కించుకునేందుకు పావులు కదిపారు. సమయం కోసం చూసిన కొందరు ఉద్యోగులు అధికారులను తప్పు దోవ పట్టించి య. 120 కుంటల భూమిని భూ బదలాయింపుకు శ్రీకారం చుట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలి అంటే జిపిఓ, ఆర్ ఐ రికార్డు సిద్ధం చేయాలి. తదుపరి యుడిసి, డిటి పరిశీలన తరువాత తహసీల్దార్ డిజిటల్ సంతకం పెట్టాలి. కానీ నిబంధనలు పక్కన పెట్టి నేరుగా తహశీల్దార్ డిజిటల్ సంతకం పెట్టారు. అయితే ఈలోపు భూ బదలాయింపు చేసుకున్న యజమాని అట్టి ప్రభుత్వ భూమి లో పంట సాగుకు యత్నించటం తో స్థానికులు గమనించి పెనుబల్లి తహశీల్దార్ కు ఫిర్యాదు చేయటంతో విషయం బహిర్గతం అయింది. గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కనే ఉన్న ఈ భూమి కోట్ల ఖరీదు పలుకుతుండడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ వివరణ కోరగా జిల్లా అధికారులు డి యస్ లు పెండింగ్ లేకుండా చూడాలి అని ఆదేశాలు ఇచ్చారని ఆ తొందరలో పొరపాటు జరిగింది అని తప్పు తెలుసుకుని అట్టి బదలాయింపుని సరి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కు లెటర్ పెట్టామని తెలిపారు. కొసమెరుపు ఏమిటంటే అధికారికి తెలియకుండా కొందరు ఉద్యోగులు తహశీల్దార్ డిజిటల్ సంతకాన్ని కావాలనే ఉపయోగించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇది అంతా విచారణ లో తేలాల్సి ఉంది.

# గణిత ప్రతిభ పాటవ పరీక్ష



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు గణిత ప్రతిభ పాటవ పరీక్ష జరిగింది. విజేతలైన అయిన వారికి మేమెంటో ప్రశంసా పత్రము అందజేశారు. అనంతరం జాతీయస్థాయిలో పేరొందిన లెక్కలు మాస్టర్ మౌలాలిని సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి జీవితంలో కావాల్సింది గణితం అని గణితం మానవ జీవితంలో ప్రముఖమైనదని ఆ సబ్జెక్టులో ప్రతి విద్యార్థి ప్రావీణ్యత పొంది ఉండాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణిత ఉపాధ్యాయులు చక్రవర్తి శ్రీనివాసరావు తదితరులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దోసపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఆంధ్రప్రభ సీనియర్ పాత్రికేయుడు, మొండికుంట గ్రామానికి చెందిన జిల్లేపల్లి గోవర్ధనా చారీ కుటుంబానికి శనివారం దోసపాటి పిచ్చేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు ఆయన స్వగృహానికి వెళ్లి దశ దిన కర్మలకు రూ 10వేల రూపాయలు వారి కుటుంబానికి అంద జేసి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవర్ధనా చారీ అకాల మృతి కలచి వేసిందన్నారు. ఆయనతో నాకు గత రెండున్నర దశాబ్దాలుగా సన్నిహితం ఉందన్నారు. ఓ పత్రికా విలేకరిగా సమాజంలోని పలు అంశాలను తన కలం ద్వారా పరిష్కరించిన ఘనత ఆయనకు ఉందన్నారు. ఆయన ఆకస్మిక మృతికి చింతిస్తూ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దల నాగేశ్వరరావు, శివ కామేశ్వరి గ్రూప్స్ సిబ్బంది దాసు, వెంకటేష్ పాల్గొన్నారు.

# శ్రామిక విభజనను వ్యతిరేకిద్దాం

**-ఫిబ్రవరి 12న జాతీయ సమ్మె**
**-సిఐటియు జాతీయ నేత పద్మనాభన్**
**-ఘనంగా సిఐటియు కార్యాలయం ప్రారంభం**
**-ఖమ్మంలో ర్యాలీ**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** శ్రామిక విభజనను కార్మిక వర్గం వ్యతిరేకించాలని కేంద్ర ప్రభుత్వం కార్మిక విధానాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి ఎకె పద్మనాభన్ పిలుపునిచ్చారు. 2026 సంవత్సరం శ్రామిక లోకానికి కీలకమవుతుందని ఆయన తెలిపారు. ఖమ్మంలో నూతనంగా నిర్మించిన సిఐటియు జిల్లా కార్యాలయాన్ని శనివారం పద్మనాభన్ ప్రారంభించారు. అంతకు ముందు పెవిలియన్ మైదానం నుంచి గట్టయ్య సెంటర్‌లోని సిఐటియు నూతన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నూతన భవనానికి బిటి రణదివే భవనంగా నామకరణం చేశారు. ఈ సందర్బంగా తుమ్మా విష్ణువర్దన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పద్మనాభన్ మాట్లాడుతూ తెలంగాణ కార్మిక లోకం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని మత పరమైన విధానాలను తీసుకు వచ్చి కార్మికుల్లో విభజన తీసుకు వస్తున్నారని ఆరోపించారు. అచ్చేదిన్ అని చెప్పిన మోడీ అచ్చే దిన్ ఎప్పుడు వస్తుందో చెప్పలేదన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా మాదిరి కార్మికులు కూడా ఐక్యంగా ఉద్యమిస్తేనే ఫలితం దక్కుతుందన్నారు. సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు మాట్లాడుతూ కార్పోరేట్లకు బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తుందని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట వేదికైన ఖమ్మం నుంచి ఐక్య పోరాటాలకు పిలుపునిస్తున్నామని దేశ ప్రజల మధ్య ఐక్యతకు చిచ్చుపెట్టే బిజెపిని గద్దెదించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సిఐటియు భవనం రేపటి ప్రజా ఉద్యమాలకు వేదిక కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేస్తే పట్టణ కూలీ రేట్లు తగ్గుతాయని కేంద్రం భావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె. వెంకటేష్, బి. మధు, జ్యోతి, రైతు సంఘం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులకు అభినందనలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** మహబూబాబాద్ ఎంఎల్‌ఏ మురళి నాయక్ అధ్యక్షతన జిల్లాలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లను సన్మాన కార్యక్రమంలో సహచర, ఎంపిలు, ఎంఎల్‌ఏలతో కలిసి ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్‌ఏ కోరం కనకయ్య పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, బయ్యారం మాజీ సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి, కొత్తపేట గంధంపల్లి సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ తరలిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/ఇల్లందు:** బిఆర్ఎస్ నాయకులు కేటీఆర్ హాజరవుతున్న క్రమంలో భారీగా ఇల్లందు నుండి తరలివెళ్లారు. శనివారం మహబూబాబాద్‌లో ఇటీవలే జరిగిన పంచాయితీ ఎన్నికల్లో సర్పంచులుగా ఎన్నికైన విజేతలను సన్మానించే కార్యక్రమానికి హాజరవుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుకు స్వాగతం పలికేందుకు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో నాయకులు, పట్టణ అధ్యక్షులు జబ్బర్, అబ్దుల్ నబీ, అజ్మీరా బావ్‌సింగ్, వీరస్వామి, రవిగౌడ్, కృష్ణయ్య, మదర్‌బి, సుదర్శన్, శ్రీకాంత్, సునీత్, అక్బర్, బాషా, రేణుక, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.